ఈనాడు
కృష్ణా

ఆదివారం 27 ఆగస్టు 2017 | 20 పేజీలు

అమరావతి ఆత్మీయత



ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి అమరావతిలో శనివారం అడుగిడిన వెంకయ్యనాయుడికి ఆత్మీయ ఘనస్వాగతం లభించింది. గన్నవరం విమానాశ్రయం నుంచి ర్యాలీగా 23 కి.మీ మేర వెళ్లిన వెంకయ్యకు దారిపొడుగునా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వెలగపూడిలో రాష్ట్ర ప్రభుత్వం పౌరసన్మానం చేసింది. ఈ సందర్భంగా వెంకయ్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు జ్ఞాపికను అందజేశారు.

చిత్రమాలిక... మధ్యపేజీల్లో

కొల్లేరు పేరు వింటేనే చేపల పులుసు గుర్తుకు వచ్చి నోరూరుతుంది. ఈ సరస్సు ప్రత్యేకం.. కొరమీను. ఈ చేప పులుసు కొంత కాలంగా అందనంత దూరమవుతోంది. ఈ జాతి చేపలు దాదాపుగా అంతరించి పోతున్నాయి.



కొరమీనం..
కొల్లేరు ముత్యం!

▲ అంతరించిపోతున్న నల్లజాతి చేపలు

▲ కాలుష్యం, ఉప్పునీటి కాటుకు బలి


▲ కాపాడుకోకుంటే పర్యావరణానికి ముప్పే

కైకలూరు, న్యూస్‌టుడే

మారల్స్ జాతికి చెందిన నల్లజాతి చేపల్లో ఒకప్పుడు కొల్లేరు ప్రాంతంలో మార్పులు, ఇంగిలాయిలు, మట్టగిడసలు, బొమ్మిడాయిలు, జెల్లలు, గొరకలు, థిలాపియా విరివిగా లభించేవి. కైకలూరు, గుడివాడ, ఆకివీడు, ఏలూరు ప్రాంతాల స్థానిక అవసరాలకు పోగా.. రోజూ 40 నుంచి 50 టన్నులు పశ్చిమ బంగాలోని కోల్‌కతా తదితర ప్రాంతాలకు లారీల్లో తరలివెళ్లేవి. రాష్ట్రంలో కూడా హైదరాబాద్, వరంగల్, తిరుపతి, కరీంనగర్ ప్రాంతాలకు రవాణా అవుతుండేవి. నేడు కొల్లేరు ప్రాంతంలో నల్లజాతి చేపల సంతతి గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం కొల్లేరు ప్రాంతాల్లోని వ్యాపారుల నుంచి అయిదారు క్వింటాళ్లు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. కొల్లేరు సరస్సుతోపాటు కాలువులు, వరిపొలాల్లోని కుంటలు, చెరువులు, ఇతర నీటి నిల్వ ప్రాంతాల్లో తెల్లచేపలతోపాటు నల్లజాతి చేపలు ఎక్కువగా ఉండేవి. తెల్లజాతి చేపల సాగులో కొద్ది శాతం కొర్రమీను పిల్లలను వేసేవారు. తెల్లచేపలకు వేసిన మేతలను అడుగు భాగాన ఉండి తిని ఇవి పెరిగేవి. నేడు తెల్లజాతి (కార్పు) చేపల సంఖ్య గణనీయంగా పెరిగింది. వీటిలో కట్లా (బొచ్చె), రోహు(శీలావతి), మృగాల్ (మోసు), ఫంగస్, పండుగొప్ప, మల్లెట్స్, వంటి



గొరకలు



మార్పులు

చేపల సంతతి పెరిగింది. రైతులు కృత్రిమంగా చెరువుల్లో సాగు చేయడం వల్ల ఇవి కొల్లేరు, తదితర ప్రాంతాల్లో విరివిగా లభ్యం అవుతున్నాయి.

నల్లచేపలే మేలు..

చేపల మాంసం ఆరోగ్యానికి మంచిదని, చేపల్లో ప్రొటీన్లు, ఆరోగ్యానికి మేలు చేసే ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉండటం వల్ల చేపలను ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇవి తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుందని, గుండెకు మేలు చేస్తాయని హృద్రోగ నిపుణులు పేర్కొంటున్నారు. తెల్ల చేపల కంటే నల్లచేపలు మరింత మేలని వైద్యులు సూచించడంతో వీటికి గిరాకీ పెరిగింది. కొరమీను, ఇతర నల్లచేపలు మార్కెట్లో తెల్లచేపల కంటే ధర ఎక్కువైనా కొనుగోళ్లు అధికంగా జరుగుతాయి. ఉత్పత్తి లేకపోవడం, వినియోగం ఎక్కువ కావడం వల్ల వీటి సంతతి క్రమంగా క్షీణించింది. మాంసాహారులైన ఈ జాతి చేపలు నీటి శైవలాలు, దోమల గుడ్లు, లార్వాలను, ఇతర పురుగులను ఆహారంగా తీసుకుంటాయి. వీటిని పరిరక్షించుకోకుంటే పర్యావరణానికి ముప్పు పొంచి ఉంది.

ఉప్పునీరు, కాలుష్యమే శాపం..

కొల్లేరు సరస్సు 77,138 ఎకరాల్లో విస్తరించి ఉంది. కొల్లేరులో సుమారు 84 రకాల మత్స్యజాతులు పెరుగుతుంటాయి. ఏటా ఈ

(మిగతా 2లో)

ఖజానాలో రూ.కోట్ల నిధులు గల్లంతు..!

- ఇంటి దొంగల పనిగానే గుర్తింపు
- బాధ్యులపై చర్యలకు మీనమేషాలు
- నిబంధనలకు విరుద్ధమైన చెల్లింపులుగా నిర్ధరణ
- కృష్ణా-గుంటూరు ఖజానా కార్యాలయాల్లో అక్రమాల భోజ్యం

ఈనాడు–అమరావతి

ఖజానాశాఖలో కొందరు ఉద్యోగులు ప్రభుత్వ ధనాన్ని కొల్లగొడుతున్నా ఉన్నతాధికారులకు చీమకుట్టినట్లు ఉండటంలేదు. ఇంటి దొంగలను గుర్తించి భరతం పట్టే విషయంలో ప్రభుత్వం మెతకవైఖరిని అవలంభిస్తోంది. గుంటూరులోని జిల్లా ఖజానాశాఖ కార్యాలయంలో ఇటీవల ఎస్‌టీఓ స్థాయి అధికారి ఒకరు రూ.10 లక్షల నిధులను ఓ ప్రైవేటు వ్యక్తి ఖాతాకు మళ్లించి దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలినా ఇప్పటి దాకా ఆ ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అదేమంటే

(మిగతా 2లో)

ఈనాడు క్లాసిఫైడ్స్ 12, 13, 14 &16,17 పేజీలలో

ఇక.. తప్పనిసరి

ఈనాడు - అమరావతి

మళ్లీ.. హెల్మెట్, సీటుబెల్టు నిబంధన వారం రోజుల్లో అమలులోకి రానుంది. ఇకపై ద్విచక్ర వాహనం నడపాలంటే హెల్మెట్ ధరించాలి. కారు నడిపేవారు కూడా తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవాల్సిందే. ఈ నిబంధనలను జరిమానాలు, లైసెన్సు రద్దు తప్పదు. గత వారం జరిగిన జిల్లా స్థాయి రహదారి భద్రతా సమావేశంలో అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబరు నుంచి తప్పనిసరి చేయబోతున్నారు. ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టడంతో ఈ సంఖ్యను మరింత తగ్గించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోంది. రోడ్డు ప్రమాదాలలో సంభవిస్తున్న మరణాల్లో ఎక్కువ మంది తలకు గాయం కావడంతోనే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హెల్మెట్ నిబంధన తీసుకురావడం వల్ల మృతుల సంఖ్యను తగ్గించవచ్చని భావిస్తున్నారు. కారు ప్రమాదాల్లోనూ చాలా సీటు బెల్టు పెట్టుకోనందునే ప్రాణాలు కోల్పోతున్నారు. ఇందులో భాగంగా.. ఇప్పుడు అవగాహనపై దృష్టి సారించారు. వాహనదారుల్లో మార్పు తీసుకొచ్చేందుకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తదుపరి దశలో నిబంధనలను పక్కాగా అమలు చేసేలా ముందుకు సాగుతున్నారు. త్వరలో నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించనున్నారు.

అవగాహన కార్యక్రమాలపై దృష్టి : వాహనదారులు నిబంధనలు పాటించేలా ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఇప్పటికే చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా లైసెన్సు లేకుండా నడుపుతున్న మైనర్లకు దశలవారీగా కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారిద్దాం అని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ కొంత వరకు ఫలితమిస్తున్నా.. ఉల్లంఘనలు మాత్రం ఆగడం లేదు. గతంలో హెల్మెట్ నిబంధనను అమలు చేశారు. కొన్నాళ్లు అవగాహన కల్పించాలని విజ్ఞప్తులు అందాయి. దీనిపై ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. ఏడాది పైగా పెద్దగా పట్టించుకోవడం లేదు. ప్రమాదాలను తగ్గించాలన్న లక్ష్యంతో నిబంధనల అమలుపై దృష్టి సారించారు. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ముందుజాగ్రత్తగా అవగాహన కార్యక్రమాలను మొదలు పెట్టారు. ఇప్పటికే నగరంలోని ప్రధాన కూడళ్లలో దీనిపై ప్రచారం చేస్తున్నారు. ఈ నెలలో హెల్మెట్ లేని వారిని ఆపి తప్పనిసరిగా ధరించాలని వివరిస్తున్నారు. దీంతో పాటు సమాంతరంగా అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నారు. ఆనక వచ్చే నెల నుంచి నిబంధనలను కచ్చితంగా అమలు చేయనున్నారు. రవాణా శాఖ అధికారులు కూడా కొరడా ఝుళిపిస్తున్నారు. జిల్లాలో 207 మంది డ్రైవర్లపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారు. నిబంధనలు ఉల్లంఘించిన 192 వాహనదారులకు చెందిన లైసెన్సులను రద్దు చేశారు. వచ్చే నెల నుంచి తొలి సారి పట్టుబడిన వారికి జరిమానా విధిస్తారు. రెండో సారి పట్టుబడితే వారి డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేయనున్నారు. నిబంధన ఉల్లంఘించే ఉద్యోగులపై కూడా చర్యలకు వెనుకాడవద్దని ఉన్నతాధికారులు స్పష్టంగా నిర్దేశించారు. శాఖా పరంగా చర్యలు తీసుకోనున్నారు.

తగ్గుతున్న ప్రమాదాలు : కృష్ణా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఈ ఏడాది తగ్గుముఖం పట్టాయి. గత ఏడాదితో ఇదే సమయానికి పోలిస్తే మరణాలు 6.56 శాతం తగ్గాయి. గత ఏడాది జులై వరకు జిల్లాలో 1,736 ప్రమాదాలు సంభవించాయి. ఇందులో 488 మంది మరణించారు. 2,077 మంది గాయపడ్డారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 1,621 ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో 456 చనిపోయారు. 1,960 మంది క్షతగాత్రులయ్యారు. 6.62 శాతం మేర ప్రమాదాలు తగ్గాయి. క్షతగాత్రుల సంఖ్య కూడా 5.63 శాతం తగ్గింది. గత ఏడాది ఇదే సమయానికి గుంటూరు జిల్లాలో 1,343 ప్రమాదాలు సంభవించాయి. ఇందులో 546 మంది చనిపోయారు. 1,488 మంది గాయపడ్డారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు పరిశీలిస్తే ప్రమాదాలు బాగా పెరిగాయి. 1,323 ఘటనల్లో 563 మంది ప్రాణాలు కోల్పోయారు. 1,500 మంది గాయాలపాలయ్యారు. మరణాలు 3.11 శాతం పెరిగాయి. క్షతగాత్రుల సంఖ్య 0.81 శాతం పెరిగింది.

అవగాహన కల్పిస్తున్నాం

పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యల కారణంగా రోడ్డు ప్రమాదాలు ఈ ఏడాది బాగా తగ్గాయి. ప్రమాదాల సమయంలో ప్రాణ నష్టం జరగకుండా నివారించాలంటే.. హెల్మెట్ వాడకం తప్పనిసరి. అందుకే ఈ నిబంధనపై కఠినంగా వ్యవహరిస్తాం. కార్లు నడిపే వారు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలి. సెప్టెంబరు, 1 నుంచి దీన్ని అమలు చేయనున్నాం. ఒకవేళ ప్రమాదాలు సంభవించినా ప్రాణాపాయం నుంచి కొద్దిపాటి గాయాలతో తప్పించుకోవచ్చు. ప్రస్తుతం వీటి వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. విస్తృతంగా సదస్సులు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వచ్చే నెల నుంచి ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తాం.

- కాంతిరాణా టాటా, ఇన్‌ఛార్జి డీసీపీ (ట్రాఫిక్), విజయవాడ

కొరమీనం.. కొల్లేరు ముత్యం!

(మొదటి పేజీ తరువాయి)

సరస్సులోకి వర్షాకాలంలో నీరు వచ్చి మార్చి, ఏప్రిల్ వరకు ఉండటం వల్ల వర్షాలకు, వరదలకు ఈ నల్లజాతి చేపలు ఉత్పత్తి అయి, ఇక్కడ జీవిస్తాయి. వీటిని అక్కడి మత్స్యకారులు మావులు, వలలు, ఇతర వేట పద్ధతుల ద్వారా వేటాడి మార్కెట్‌కు తరలిస్తుంటారు. ఇవి ఎక్కువగా పడే సమయంలో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేసేవారు. వీటిలో కొరమీను కిలో రూ.450 నుంచి రూ.500, మట్టగిడసలు రూ.100 నుంచి రూ.150, మార్పులు రూ.250 నుంచి రూ.300, ఇంగిలాయిలు రూ.200 నుంచి రూ.180 వరకు విక్రయించేవారు. కొల్లేరు ప్రాంతంలో పట్టిన నల్లజాతి చేపలను ప్రత్యేకంగా కైకలూరు, ఆకివీడు, ఏలూరు ప్రాంతంల్లో కొనుగోలు చేసే వ్యాపారులున్నారు. ఎక్కువ మొత్తంలో అయితే ప్రత్యేక లారీలు, రైళ్లలో చెన్నై, కోల్‌కతాలకు తరలించి విక్రయాలు చేస్తుంటారు. కొంత కాలంగా కొల్లేరు సరస్సు కాలుష్య కాసారంగా మారడంతో వీటి సంతతి అంతరించిపోతోంది. సరస్సులోని నీటిలో అమ్మోనియా, నైట్రేట్ వంటి విషవాయువులు వెలువడం, వరి చేలు, చేపల సాగులో హానికర రసాయనాల వాడకం వల్ల ఈ చేపలకు రెడ్ డీసీజ్, మొప్పల వ్యాధులు, బ్యాక్టీరియా, వైరస్ వ్యాధులు సోకి మృతి చెందుతున్నాయి. కొల్లేరుకు ఎగువలోని పంచదార, ఇతర పరిశ్రమల వల్ల వెలువడే మొలాసిస్ వల్ల ఇవి గుడ్డు స్థాయిలోనే నాశనం అవుతున్నట్లు మత్స్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. చేపల సాగు ప్రారంభంలో ఇక్కడి రైతులు పాలికల్చర్ (తెల్లచేపలతో కలిపి నల్లచేపలు కూడ సాగు) చేసేవారు. దీంతో ఇవి మార్కెట్లో ఎక్కువగా అందుబాటులో ఉండేవి. క్రమేపీ ఇవి తెల్లచేపల పిల్లలను తింటున్నాయని వీటిని సాగులో వేయడం లేదు.



తలపై బ్యాక్టీరియా వ్యాధితో కొరమీను

రెండు అంగుళాల పిల్ల ఖరీదు రూ.2 వరకు ఉంది. వీటి పిల్లలు లభ్యం కాకపోవడం, ఇతర చేపలను ఆహారంగా తీసుకోవడంతో వీటి సాగు పట్ల రైతులు మక్కువ చూపడం లేదు.

ప్రభుత్వ హేచరీల్లో ఉత్పత్తి అవసరం

ధర ఎక్కువగా వచ్చే అవకాశం దృష్ట్యా కొల్లేరు ప్రాంతంలో నల్లజాతి చేపలను పెంచుదామనే రైతులకు పిల్లల సమస్య ప్రధానంగా ఉంది. వీటి పిల్లల ఉత్పత్తి లేకపోవడం, సహజసిద్ధంగా సేకరించాల్సి రావడంతో పాటు ధర ఎక్కువగా ఉండటంతో అనుకూలమైన ప్రాంతాల్లో కూడా వీటిని సాగు చేయడం లేదు. కైకలూరు ప్రాంతంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలున్నాయి. ప్రభుత్వం ఈ కేంద్రాల్లో నల్లజాతి చేప పిల్లలను ఉత్పత్తి చేసి రైతులకు సరఫరా చేయాలనే డిమాండ్ కూడా ఉంది. చెరువు మొత్తంలో వీటినే సాగు చేసే అవకాశాలు లేవు. మరో జాతి చేపలతో కలిపి వీటిని సాగు చేయాల్సి ఉంది. గత ఏడాది వర్షాలు లేకపోవడం, కొల్లేరుకు ఉప్పునీరు రావడం వల్ల సరస్సులోని నల్లజాతి చేపలు దాదాపుగా అంతరించాయనే చెప్పాలి.

పరిశోధనలు..

నల్లజాతి చేపలపై కాకినాడలోని కేంద్రీయ మత్స్య విశ్వవిద్యాలయం(సీఐఎఫ్ఐ) పరిశోధనలు చేస్తోంది. ఇప్పటికే మార్పు జాతి చేపలపై పరిశోధనలు చేసి వీటి ఉత్పత్తికి చర్యలు చేపట్టింది. ముంబయి మత్స్య విశ్వవిద్యాలయం, తిరుపతిలోని పద్మావతి విశ్వవిద్యాలయం అంతరించిపోతున్న చేపలపై పరిశోధనలు చేస్తున్నాయి. కృష్ణా జిల్లాలో అవనిగడ్డలో ఏర్పాటు చేసిన పాలిటెక్నిక్ కళాశాలలోనూ నల్లజాతి చేపల మనుగడపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తోంది. కొల్లేరుకు వచ్చే కాలుష్యాన్ని అరికడితే సరస్సులోని 80 రకాల మత్స్యజాతులు, 183 రకాల పక్షిజాతులకు మనుగడ సాధ్యం అవుతుంది.

మత్స్యశాఖ ద్వారా అనేక ప్రయత్నాలు



ప్రభుత్వం ఆక్వా రంగాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటోంది. రైతులకు అనేక రాయితీలు ఇస్తోంది. తెల్ల చేపలు, రొయ్యల సాగు చేస్తున్న రైతులకు, మత్స్యకారులకు ప్రోత్సాహకాలు ఇస్తోంది. నల్లజాతి చేపల పరిరక్షణకు కాకినాడ, బెంగళూరులలో ప్రయోగాలు చేస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడుల కోసం పరిశోధనలు జరుగుతున్నాయి. కొరమీను పిల్లల ఉత్పత్తి కేంద్రాలు లేవు. ఇవి బురద, ఇతర ప్రాంతాల్లో అగస్టు నుంచి మే మాసాల్లో గుడ్లు పెడుతాయి. సహజ సిద్ధమైన మంచి నీటి వనరుల్లో అడుగుభాగాన పెరుగుతుంటాయి. తెలంగాణ ప్రభుత్వం దీన్ని రాష్ట్ర చేపగా ప్రకటించింది. ప్రపంచంలోని ఫిన్‌ల్యాండ్, థాయిలాండ్, తైవాన్, తదితర దేశాల్లో సాగు చేస్తున్నారు. అల్జీమర్స్ వ్యాధికి ఇది దివ్యఔషధంలా పని చేస్తుంది. కొల్లేరు ప్రాంతంలోని నేలలు వీటి పెరుగుదలకు మరింత అనుకూలం. మృగశిర కార్తెలో హైదరాబాద్‌లోని చేప మందుకు వీటి పిల్లలనే ఉపయోగిస్తుంటారు. ఏటా శీతాకాలంలో వీటికి బ్యాక్టీరియతో తలపై పుండు వ్యాధి వస్తుంది.

-డి.సాల్మన్‌సుధాకర్, మత్స్యశాఖ సహాయ సంచాలకుడు, కైకలూరు

నల్లజాతి సరకు రావడం లేదు



30 ఏళ్లుగా నల్లజాతి చేపలపైనే ఆధారపడి వ్యాపారం చేస్తున్నాను. కైకలూరు, కొల్లేరు, ఆకివీడు, ఏలూరు ప్రాంతాల్లో సుమారు 75 వరకు ఈ చేపలను ఎగుమతి చేసే కంపెనీలు ఉన్నాయి. ఇటీవల కాలంలో ఈ కేంద్రాలకు వచ్చే నల్లజాతి చేపలు తగ్గిపోయాయి. ముఖ్యంగా కొరమీను రావడం లేదు. మట్టగిడసలు, మార్పులు, ఇంగిలాయిలు రావడం లేదు. ఐదేళ్ల క్రితం వరకు బొమ్మిడాయిలు వస్తుండేవి. నేడు బొమ్మిడాయిలు పూర్తిగా కన్పించడం లేదు. గతంలో ప్రతి రోజు నాలుగైదు రకాల నల్లజాతి చేపలను కలిపి 3, 4 క్వింటాళ్ల వరకు కలకత్తాకు తరలించేవాడిని, నేడు ఒక క్వింటాకూడ తరలించే పరిస్థితి లేదు. నల్లజాతి చేపలు అంతరించిపోవడానికి ఉప్పునీరు, కాలుష్యమే ప్రధాన కారణం. కొల్లేరు సరస్సును కాలుష్య ప్రభావనం నుంచి పరిరక్షించి, ఉప్పు నీటి ప్రభావం లేకుండ రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టాలి. ప్రభుత్వం అంతరించి పోతున్న నల్లజాతి చేపలను గుర్తించి వాటిని పరిరక్షించాలి. మరిన్ని పరిశోధనలు జరగాలి.

- ఆసీఫ్ పాషా, జాతీయ ఉత్తమ చేపల రైతు, కేఎంసీ ఫిష్ ప్యాకింగ్, కైకలూరు

ఖజానాలో రూ.కోట్ల నిధులు గల్లంతు..!

(మొదటి పేజీ తరువాయి)

విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఇంతకు ముందే తెనాలి సబ్‌ట్రెజరీ కార్యాలయంలో చిరుద్యోగి ఏకంగా రూ.1.20 కోట్లు బినామీ ఖాతాలకు మళ్లించి అక్రమాలకు పాల్పడినట్లు నిగ్గుతేలింది. కృష్ణా జిల్లా మచిలీపట్నం సబ్‌ట్రెజరీ కార్యాలయంలో రూ.75 లక్షలు మాయమైనట్లు అక్కడ కేసు నమోదయ్యింది. విధి నిర్వహణలో ఉద్యోగులు అక్రమాలకు పాల్పడటం వల్లే కాకుండా కొన్ని నిబంధనలకు విరుద్ధమైన చెల్లింపులు జరిపి అంతిమంగా ప్రభుత్వం నష్టపోయేలా వ్యవహరించారు. గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఒప్పంద ఉద్యోగులకు 2010 పీఆర్‌సీ బకాయిలు సుమారు రూ.కోటిన్నర దాకా చెల్లించారు. ఇది నిబంధనలకు విరుద్ధమైన చెల్లింపులని ఇప్పటికే గుంటూరు విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇలా వరుస అక్రమాలతో ఖజానాశాఖ ప్రతిష్ఠ మసకబారుతుంటే ఉన్నతాధికారుల్లో చలనం ఉండటం లేదు. దర్యాప్తు పేరుతో అక్రమార్కులను వెనకేసుకొస్తున్నారనే అపవాదను మూటగట్టుకుంటున్నారు.

ప్రభుత్వోద్యోగులు నెలవారీ జీతాల బిల్లులు, టీఏ, డీఏ బిల్లులు, వాహనాల ఇంధన బిల్లులు, ఇతరత్రా వ్యయాలకు సంబంధించిన బిల్లులు, ఉపకారవేతనాలు, బోధనా రుసుములు ఇవన్నీ కూడా ఖజనాశాఖ (ట్రెజరీ) ద్వారానే ఆమోదం పొందుతాయి. ఈ నేపథ్యంలో ఖజానాశాఖలో పనిచేసే ఉద్యోగులు నికార్సుగా ఉంటే తప్ప నిధుల సక్రమ వినియోగం జరగదు. కానీ ఓ ఉద్యోగి వేరే ఉద్యోగికి చెందిన పాస్‌వర్డుతో ఈ దుర్వినియోగానికి పాల్పడ్డారు. సహచర ఉద్యోగుల పేరుతోనే అవకతవకలకు పాల్పడుతుంటే తామెలా ఉద్యోగం చేయగలమని కొందరు అధికారులు వాపోతున్నారు. గుంటూరు జిల్లా ఖజానా కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు సబ్‌ట్రెజరీ అదికారుల పేరుతో మొత్తం రూ.10 లక్షలకు పైగా బినామీ ఖాతాల్లోకి మళ్లించి సదరు ఉద్యోగి ఈ మొత్తాన్ని సొమ్ము చేసుకున్నారు. తీరా ఇది విచారణలో వెలుగులోకి రావటంతో సదరు ఉద్యోగి వెంటనే అప్రమత్తమై ఆ మొత్తాన్ని ఇటీవల తిరిగి ఖజానాశాఖకు జమచేయించినట్లు తెలుస్తోంది.

కంప్యూటర్ పరిజ్ఞానమే పెట్టుబడి.. : గుంటూరు, తెనాలిల్లో చోటు చేసుకున్న రెండు అవకతవకలను పరిశీలిస్తే కంప్యూటర్‌పై బాగా అవగాహన ఉన్న వారే రెండోకంటికి తెలియకుండా అక్రమాలకు ఒడిగట్టినట్లు తెలుస్తోంది. శాఖలో కారుణ్య నియామకాలు, గుమ్మస్తాల నుంచి పదోన్నతుల ద్వారా ఎస్‌టీఓ, ఏటీఓలుగా అయిన వారిలో చాలా మందికి ఆయా పద్దులను పాస్ చేయటానికి కంప్యూటర్ వినియోగం ఇప్పటికీ తెలియటం లేదు. గత ఏడాదిన్నరగా చూస్తే ఖజానా బిల్లులు చెల్లింపు విషయంలో ఎన్నో నూతన కంప్యూటర్ విధానాలు అమల్లోకి వచ్చాయి. ఈ విధానాలపై సమగ్ర శిక్షణ ఇవ్వకుండా వెంటనే అమలు చేయాలని సూచిస్తోంది. ఇది కంప్యూటర్‌పై పరిజ్ఞానం లేని వారికి శాపం అవుతుంటే కంప్యూటర్‌పై అవగాహన ఉన్న వారికి ఇదే వరంగా మారుతోంది. కంప్యూటర్‌పై అవగాహన ఉన్న ఉద్యోగుల సహకారం తీసుకునే క్రమంలో కొన్నిసార్లు పొరపాటున ఉద్యోగులు తాము వినియోగించే కంప్యూటర్ పాస్‌వర్డు, సిస్టమ్ లాక్ సైతం చెప్పేస్తున్నారు. దీంతో అలవోకగా కొందరు అక్రమాలకు ఒడిగట్టి చివరకు అమాయకులైన ఉద్యోగులను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. మచిలీపట్నంలో కూడా ఎస్ఎల్‌వీ రిజిస్టర్‌లో చెక్కుల వివరాలు నమోదు చేయాల్సిన ఖజానా ఉద్యోగి వాటిని ఎలా నమోదు చేయాలో తెలియక వేరే శాఖ ఉద్యోగిని వేయమని ఆ రిజిస్టర్ అందజేయగా ఇదే అదనుగా అతను ఆ చెక్కులను తీసుకుని తనకు చెందిన బినామీ ఖాతాల్లో జమ చేసుకున్నారు. గుంటూరు జిల్లాలో ఈతరహా అక్రమాలు డెల్టా, పల్నాడులోని కొన్ని సబ్‌ట్రెజరీ కార్యాలయాల్లో కూడా జరిగాయని, అయితే అవన్నీ వెలుగులోకి రాకుండా ఎక్కడికక్కడ లాబీయింగ్ చేస్తున్నారని శాఖాధికారి ఒకరు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెండు జిల్లాల్లోని ఖజానా కార్యాలయాల్లో సమగ్ర విచారణ జరిపిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి రావని ఉద్యోగ వర్గాలు అంటున్నాయి.



గుడ్డు బరువు తగ్గినా.. పాడైనా

తిరస్కరించండి

రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కె.సంధ్యారాణి

గంపలగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం కింది పాఠశాలలకు ఏజెన్సీల ద్వారా సరఫరా చేస్తున్న కోడిగుడ్లు తక్కువ బరువున్నా, పాడైపోయినా వెంటనే తిరస్కరించాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కె.సంధ్యారాణి ఉత్తర్వులు జారీ చేశారు. గుత్తేదారు పాఠశాలలకు సరఫరా చేసే కోడిగుడ్లు దిగుమతి చేసుకునేటపుడు ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిబంధనలు ఖాతరు చేయకుండా గుత్తేదారు కోడిగుడ్లు సరఫరా చేస్తే పాఠశాలలో దిగుమతి చేసుకోవద్దని ఆమె ఆదేశాల్లో స్పష్టం చేశారు. కోడిగుడ్ల నిబంధనలను ఎంఈవోలకు శనివారం పంపిన ఆదేశాల్లో కమిషనర్ వెల్లడించారు. పథకం అమల్లో పంపిణీ చేస్తున్న గుడ్లపై వచ్చిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ తాజాగా అమలు చేస్తున్న మార్గదర్శకాలను ఎంఈవోలకు, ప్రధానోపాధ్యాయులకు పంపించారు.

మార్గదర్శకాలు ఇవే

✤ పాఠశాలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లు విద్యార్థుల సంఖ్య మేరకు వారానికి సరిపడా మాత్రమే దిగుమతి చేసుకోవాలి. ✤ గుడ్డు బరువు 48-52 గ్రాముల మధ్య ఉండాలి. ✤ దిగుమతి చేసుకున్న గుడ్లను తలుపులు మూసే బీరువాలు, పెట్టెల్లో ఉంచకుండా వంట గదిలో బయటే ఉండేలా దాచుకోవాలి. ✤ కుళ్లిపోయిన కోడిగుడ్లు దిగుమతి చేసుకోకూడదు. ✤ ఉడకబెట్టిన తర్వాత అవి నాణ్యత లేవని తేలితే వాటిని విద్యార్థులకు ఆహారంగా అందించకూడదు. ✤ ఇలా బరువు తక్కువగా ఉన్న, పాడైపోయిన కోడిగుడ్లు గుత్తేదారునికి వాపసు ఇచ్చి వాటి స్థానంలో తిరిగి నాణ్యమైనవి తీసుకోవాలి. ✤ పాడైనపోయిన గుడ్లను బడిలో పారేయకూడదు. ✤ పాడైన, బరువు తక్కువ ఉన్న కోడిగుడ్లను తిరిగి తీసుకునేందుకు సరఫరాదారు తిరస్కరిస్తే సదరు ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో లేదా డీఈవోకు ఫిర్యాదు చేయాలి.

గుడ్డు తింటున్న విద్యార్థులు 2.67 లక్షలు

✤ ప్రధానోపాధ్యాయుడు భోజన పథకం గుడ్ల వివరాలను సంబంధిత పత్రంలో ఎప్పటికపుడు నమోదు చేయాలి. ✤ జిల్లాలో ఈ ఏడాది 3157 పాఠశాలల్లో 2,67,542 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకంలో కోడిగుడ్లు తింటున్నారు. ✤ ప్రతి విద్యార్థికి కోడిగుడ్డు సరఫరా చేసేందుకు రోజుకు ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం రూ. 2. 35 పైసలు వ్యయం చేస్తోంది. ✤ తాజా నిబంధనల మేరకు ఇకపై ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి రోజుకు రూ. 4. 13 పైసలు, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి రూ. 6. 18 పైసలు చొప్పున వంట ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లిస్తుంది. ✤ తాజా మార్గదర్శకాలను అమలు చేయాలని ఆదేశాలు అందాయని గంపలగూడెం ఎంఈవో సోమశేఖర్‌నాయక్ శనివారం తెలిపారు.

బాధితుల భరోసాకే మీకోసం

జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠత్రిపాఠి



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

గొడుగుపేట(మచిలీపట్నం),న్యూస్‌టుడే: బాధితులకు అండగా ఉంటూ వారికి భరోసా ఇచ్చేందుకు మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠత్రిపాఠి అన్నారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో శనివారం మీకోసం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నందిగామ, నూజివీడు సబ్‌డివిజన్‌ల పరిధిలోని బాధితులకు అందుబాటులో ఉండేందుకు ప్రతి శనివారం విజయవాడలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బాధితుల పక్షాన పోలీసు శాఖ ఉంటుందని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ అధికారులను ఆదేశించారు.

ప్రతిభ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పోర్టురోడ్డు(మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని గుర్తింపు పొందిన విద్యాసంస్థలు, కేంద్రీయ విద్యాలయాలు, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ విద్యాలయాల్లో ఈ ఏడాది నిర్వహించనున్న రాష్ట్రస్థాయి నేషనల్ టాలెంట్ సెర్చ్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో దేవానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నవంబరు 5వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్న ఈ పరీక్షలో 10వ తరగతి విద్యార్థులు మాత్రమే రాసేందుకు అర్హులన్నారు. పరీక్ష రుసుం రూ. 200, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అనంతరం చెల్లించవచ్చన్నారు. వచ్చే నెల 18వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని, 20వ తేదీలోపు చలానాలు కట్టాలని చెప్పారు. 22వ తేదీలోపు దరఖాస్తులు, చలానాలు ప్రధానోపాధ్యాయులంతా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గానీ, ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. బీఎస్‌ఈఏపీ. ఓఆర్‌జీలో గానీ సంప్రదించాలని తెలిపారు.

డిగ్రీ రెండో సెమ్ ఫలితాల విడుదల

49.70 శాతం మంది ఉత్తీర్ణత

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో కృష్ణా విశ్వవిద్యాలయ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన డిగ్రీ మొదటి ఏడాది రెండో సెమిస్టర్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. రెగ్యులర్ అభ్యర్థులు 11,625 మంది పరీక్షలు రాయగా 5,802 మంది (49. 70 శాతం), సప్లిమెంటరీ అభ్యర్థులు 4,597 మందికిగాను 2,206 మంది (47. 99 శాతం) ఉత్తీర్ణత సాధించారని పరీక్షల నిర్వహణాధికారి కె. లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లాలోని 165 డిగ్రీ కళాశాలల్లో 112 కళాశాలలు కృష్ణా వర్సిటీ అనుబంధంగా ఉన్నాయి. మిగిలినవి స్వయంప్రతిపత్తి గల కళాశాలలు.

ఎంసెట్ సింగిల్ విండో- 2 కౌన్సెలింగ్

జూపూడి(ఇబ్రహీంపట్నం), న్యూస్‌టుడే: ఎంసెట్ సింగిల్ విండో 2 కౌన్సిలింగ్‌ను నిమ్రా కళాశాలలో ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు నిమ్రా కళాశాలల అకడమిక్ డైరెక్టర్ టి. నారాయణమూర్తి శనివారం తెలిపారు. ఎంసెట్‌లో ర్యాంకు పొంది బీ ఫార్మసీ, ఫార్మా డీ చదవగోరే వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తారని ఆయన అన్నారు. అభ్యర్థులు తెల్లరేషన్ కార్డు, ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకుని కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని తెలిపారు.

ఆర్టీసీ కొరియర్ సేవలు

ఆదాయం పెంచే దిశగా చర్యలు ❖ రూ.100 కోట్ల రాబడి లక్ష్యం

గొడుగుపేట(మచిలీపట్నం),న్యూస్‌టుడే: ఆర్టీసీ ఆదాయం పెంచేదిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ ఈడీసీ శశిధర్ అన్నారు. శనివారం మచిలీపట్నం ఆర్టీసీ డిపో సందర్శించిన ఆయన ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 1985 నుంచి ఆర్టీసీ బస్టాండ్లలో కొరియర్ సేవలు అందిస్తున్న ఏఎన్‌ఎల్ సంస్థతో కదుర్చుకున్న గడువు పూర్తయ్యిందని, ఇకపై ఆర్టీసీ సంస్థే కొరియర్ సేవలు అందిస్తుందని చెప్పారు. దీనిలో భాగంగా ట్రైల్ రన్‌లో రెండు వేల బస్సులతో రూ. 15కోట్ల వ్యాపారం చేసినట్లు వివరించారు. ఇకపై రాష్ట్రవ్యాప్తంగా 12వేల బస్సులతో రూ. 100 కోట్ల ఆదాయం సాధించే లక్ష్యంగా కృషిచేస్తున్నామన్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కొరియర్ సేవలు ప్రారంభం అవుతాయని తెలిపారు. తమ సంస్థ ద్వారా రవాణాచేసే ప్రతి వస్తువుకు బీమా చేస్తామన్నారు. అతివేగంగా పార్శిల్ రవాణా జరిగేలా చర్యలు తీసుకున్నామని, ప్రతి డిపోలో ఇందుకు తగ్గ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ప్రతిబస్సులో పార్శిళ్ల కోసం ఓ పెట్టె ఏర్పాటు చేస్తున్నామన్నారు. వర్షం వచ్చినా పార్శిల్



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

తడవకుండా జాగ్రత్తగా గమ్యానికి చేర్చడానికి కావాల్సిన అన్ని వసతులు బస్సుల్లో కల్పిస్తున్నామన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలో 227 ఆర్టీసీ డిపోలు, 120 ఏటీబీలు, 146 బిజినెస్ ఫెసిలిటేటర్ల ద్వారా సేవలు అందిస్తామన్నారు. ఆర్టీసీ ఆదాయం పెంచే బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరం భాగస్వాములవుదాం అంటూ ఉద్యోగులచే ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం నాగేంద్రప్రసాద్ డిపో అసిస్టెంట్ మేనేజర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి’

గాంధీనగర్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కార్మిక చట్టాల సవరణ, పన్నుల విధింపుపై ఐక్యంగా పోరాడాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. దేశంపై జీఎస్టీ ప్రభావం అనే అంశంపై శనివారం ప్రెస్ క్లబ్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన జీఎస్టీ విధానం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

భారమని ఇదంతా ప్రపంచ బ్యాంకు విధానాలలో భాగమేనని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరాచక పాలన సాగిస్తున్నాయని, కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పౌరహక్కుల ఉద్యమ నేత, విద్యావేత్త కనకాచారి 12వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎం ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, టి. సుబ్బారెడ్డి రామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

లంబోదరునికి నీరాజనం!



మచిలీపట్నం సర్కిల్‌పేట సామావారివీధిలో..



రెడ్డిపాలెంలో..



భొజ్జిల్లిపేట ట్రాన్స్‌ఫార్మర్ వీధిలో..



పాతరామన్నపేటలో..

ఘనంగా చవితి వేడుకలు

ఆకట్టుకుంటున్న ప్రతిమలు

పార్వతీ పుత్రునికి జిల్లా వ్యాప్తంగా భక్తులు నీరాజనాలు అర్పిస్తున్నారు. విజయవాడ నగరంలో 72 అడుగుల మట్టి విగ్రహాన్ని దర్శించడానికి భక్తజన సందోహం బారులు తీరుతోంది. జిల్లాకేంద్రమైన మచిలీపట్నంతో పాటు కైకలూరు, పెడన, తిరువూరు ప్రాంతాల్లోని గణనాథుని ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. విద్యుద్దీప కాంతులతో అలంకరించిన మండపాల్లో వివిధ రూపాల్లోని వినాయక ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి.



విజయవాడ జింఖానా మైదానంలోని 72 అడుగుల మృణ్మయ గణపతి



గంపలగూడెం మండలం నెమలి ఆలయంలో



మండవల్లి మండలం పులపర్రులో..



తిరువూరు శాంతినగర్‌లో..





విస్సన్నపేట గాంధీబొమ్మ కూడలిలో..



కలిదిండి గ్రంథాలయం ఎదుట..



కలిదిండి మండలం కోటకలిదిండిలో ..



బంటుమిల్లి గణపతి ఆలయం వద్ద ..



బ్రహ్మపురంలో ..



కోనేరు సెంటరులో..



కాలేఖాన్‌పేటలో..



ఆంధ్రా ఆసుపత్రిలో..



కోనేరు సెంటరులో..

మాజీ సర్పంచి హత్యకేసులో వీడిన మిస్టరీ

కాపలాదారుడే పథకం ప్రకారం హత్య ★ మందలింపు, ఆర్థిక లావాదేవీలే కారణం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ పరిటాల మహేశ్..పక్కన సీఐ రవికుమార్

మండవల్లి, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించిన మండవల్లి మాజీ సర్పంచి బోడావుల కృష్ణారావు (60) హత్యకేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈనెల 22న అర్ధరాత్రి అయ్యవారి రుద్రవరంలోని తన అయిదెకరాల చెరువు వద్దకు వెళ్లిన ఆయన దారుణంగా హత్యకు గురైన సంగతి పాఠకులకు తెలిసిందే. ఈ కేసులో మొదటినుంచి అనుమానం వ్యక్తం చేస్తున్న చెరువు కాపలాదారుడే ప్రధాన నిందితుడని పోలీసుల దర్యాప్తులో తేలింది. కేసుకు సంబంధించిన నిందితులను శుక్రవారం కైకలూరు మండలంలోని ఆచవరం గ్రామంలో పోలీసులు అరెస్టుచేశారు. ఈ మేరకు శనివారం గుడివాడ డీఎస్పీ పరిటాల మహేశ్, కైకలూరు సీఐ రవికుమార్, ఎస్‌ఐ మణికుమార్ ఆధ్వర్యంలో నిందితులను విలేకర్ల ముందు హాజరుపరిచి వివరాలను వెల్లండించారు. ముఖ్యంగా చెరువు యజమాని కృష్ణారావు కాపలాదారుడు దుర్గారావు, భార్య ప్రవర్తన తీరుపై మందలింపు, ఇద్దరి మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణంగా గుర్తించారు. సుమారు రెండేళ్లుగా అయ్యవారిరుద్రవరం రోడ్డులోని ఈ చెరువుపై దుర్గారావు, భార్య వెళంగనితో కలిసి కాపలాదారుడిగా పనిచేస్తున్నాడు. హత్య జరిగిన రోజున కుటుంబంతో సహా పరారీలో ఉండడంతో వారిపై పోలీసులు, బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. నాలుగు బృందాలుగా విడిపోయి వివిధ ప్రాంతాలలో గాలించిన పోలీసులు ఆచవరంలో కుంచె దుర్గారావును, భార్య వెళంగిని, సహకరించిన బంధువు నాగేంద్రబాబును పోలీసులు అదుపులోనికి తీసుకుని విచారించారు. హత్య ఎందుకు చేశావని దుర్గారావును ప్రశ్నించగా.. చెరువుపై పనిచేస్తున్న తనకు ఇవ్వాల్సిన జీతం డబ్బులను యాజమాని సక్రమంగా ఇవ్వకపోవడం, భార్యతోపాటు తనను మందలించడాన్ని, మనసులో పెట్టుకుని తనతోపాటు ఉంటున్న వేళంగిని బావ నాగేంద్రబాబుతో చెప్పి కక్ష తీర్చుకోవాలనుకున్నానని తెలిపాడు. నాగేంద్రబాబు చిగురుకోటకు చెందిన పేరం ఏసుబాబును రూ.10 వేలు ఇస్తానని 22న రాత్రి పిలిపించుకున్నారు. దుర్గారావు భార్యను భోజనం చేసి పడుకోమని చెప్పి రాత్రి ఒంటి గంట ప్రాంతంలో యజమానికి ఫోన్‌చేసి వారు ఉంటున్న చెరువుకు ముందున్న నారాయణరావు చెరువువద్ద ఉన్న షెడ్డు పక్కనే దుర్గారావు, ఏసుబాబు దాక్కున్నారు. నాగేంద్రబాబు రోడ్డుపై నుంచి వస్తున్న కృష్ణారావును ఆపగా దుర్గారావు తనతో పాటు తెచ్చుకున్న రాడ్డులు, కత్తులతో తలపై, మెడపై దాడిచేయగా అతను పెద్దగా కేకలు వేస్తూ కుప్పకూలిపోయాడు. మూలుగుతున్న అతన్ని రోడ్డుపై నుంచి నారాయణరావు చెరువుపై ఉన్న షెడ్డు పక్కకు లాక్కుపోయారు. అక్కడ విచక్షణారహితంగా తలపై దాడి చేసి చనిపోయాడనుకున్న తర్వాత వెళ్లిపోయారు. ద్విచక్రవాహనాన్ని కొర్లపాడు పుంతరోడ్డులో పెట్టి ఏసుబాబు పరారయ్యాడు. నాగేంద్రబాబు, దుర్గారావు మళ్లీ ఇంటికి వచ్చి భార్య వెళంగినిని తీసుకుని ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు డీఎస్పీ వివరించారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ రవికుమార్‌ను, ఎస్‌ఐ మణికుమార్, సిబ్బందిని అభినందించారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



మృతిచెందిన లావణ్య

కోడూరు (ముదినేపల్లి), న్యూస్‌టుడే: మోటారు ద్వారా నీరు పట్టుకుంటుండగా అది ఒరిగిపోవడంతో పడకుండా పట్టుకునేందుకు ప్రయత్నించిన వివాహిత విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందగా.. ఆమె భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం కోడూరుకు చెందిన వల్లభనేని లావణ్య (38) శనివారం ఉదయం మోటారు ద్వారా నీటిని పడుతున్నారు. అదే సమయంలో మోటారు పక్కకు కదిలి కిందకు పడిపోతుండటంతో లావణ్య దాన్ని పట్టుకోవటానికి ప్రయత్నించింది. ఆ సమయంలో మోటారుకు విద్యుత్తు సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై పక్కకు పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందింది. రక్షించటానికి ప్రయత్నించిన ఆమె భర్త శేషుబాబు గాయపడ్డారు. ముదినేపల్లి ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి ఇద్దరు కుమారులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

తెదేపా మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మృతి



అన్వర్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఉమామహేశ్వరరావు

షేక్ అన్వర్ (పాత చిత్రం)

పెండ్యాల(కంచికచర్ల గ్రామీణం)న్యూస్‌టుడే: తెదేపా మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ అన్వర్ (63) కన్నుమూశారు. పెండ్యాలలో ఆయన నివాసంలో శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్వర్ మృతి తెదేపాకు తీరని లోటన్నారు. మైనార్టీల అభివృద్ధికి నిరంతరం కృషి చేసి పార్టీకి ఎనలేని సేవలనందించారని తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడిగా, ఎంపీపీగా, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యునిగా గత 30 ఏళ్లుగా అనేక పదవుల్లో కొనసాగుతూ ప్రజలతో మమేకమయ్యారన్నారు. నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఎంపీపీ వేల్పుల ప్రశాంతి, జడ్పీటీసీ సభ్యులు కోగంటి బాబు, వాసిరెడ్డి ప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని నరసింహారావు, నందిగామ నగర పంచాయతీ ఛైర్మన్ యరగొర్ల పద్మావతి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అన్వర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతితో పెండ్యాల గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

వ్యభిచార ముఠా గుట్టురట్టు

✦ ఐదుగురు నిర్వాహకుల పట్టివేత
✦ ఇద్దరు యువతులకు విముక్తి

గవర్నర్‌పేట (విజయవాడ), న్యూస్‌టుడే: గవర్నర్‌పేటలోని లాడ్జిలే కేంద్రంగా గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార ముఠా కార్యకలాపాలను గవర్నర్‌పేట పోలీసులు శనివారం రట్టు చేశారు. గవర్నర్‌పేట సీఐ పవన్‌కుమార్‌రెడ్డికి వచ్చిన సమాచారం మేరకు.. పాత బస్టాండ్ సమీపంలోని ఒక లాడ్జిపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఇద్దరు నిర్వాహకులు పప్పుల షణ్ముఖ సంధ్య, లింగం సతీష్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరు ఇచ్చిన సమాచారం మేరకు రామవరప్పాడుకు చెందిన మరో ముగ్గురు నిర్వాహకులు ముత్యాల జయ, ఈడే నాంచారయ్య, అనగాని ప్రియలను అదుపులోకి తీసుకున్నారు. వీరు యువతులను తీసుకువచ్చి లాడ్జిలకు పంపి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తేలడంతో వారిని అరెస్టు చేశారు. ఇద్దరు యువతులను విడిపించి వారిని సంరక్షణ కేంద్రానికి పంపించారు.

మూడేళ్ల బాలికపై అత్యాచారం

పెనమలూరు, న్యూస్‌టుడే: కామంతో కళ్లు మూసుకుపోయిన కామాంధుడు.. ఓ పసికూనను పంట పొలాల్లోకి నమ్మకంగా తీసుకువెళ్లి అత్యాచారం చేసిన ఘటనపై కృష్ణా జిల్లా పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి జిల్లా ఎమ్వీ93 గ్రామానికి చెందిన ఓ కుటుంబం బతుకు దెరువు కోసం కొంతకాలం క్రితం విజయవాడ నగరానికి చేరుకొంది. నగర శివార్లలోని వందడుగుల రహదారిలోని ఆదర్శ బిల్డర్స్ నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్స్‌లో సెంట్రింగ్ పనులు చేస్తుంటారు. భార్యాభర్తలిద్దరూ ఇక్కడే పనిచేస్తుండగా వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. ఇక్కడే పనిచేసే రోబిన్ బిస్వాస్ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం ఈ బాలికను ఎత్తుకొని ఆటలాడుతున్నట్లు నటిస్తూ కొంతసేపటి తర్వాత పంట పొలాల్లోకి తీసుకు వెళ్లాడు. సాయంత్రం వరకు కుమార్తె కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె తండ్రి బిడ్డను వెతుకుతూ సమీపంలోని పంట పొలాల వైపు వెళ్లగా అక్కడ కుమార్తెతో పాటు రోబిన్‌బిస్వాస్ కూడా ఉండడాన్ని గుర్తించాడు. బాలిక తండ్రిని చూసి అతను పరారీ కాగా తన చిన్నారిపై అత్యాచారం జరిపినట్లు గుర్తించాడు. వెంటనే పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన



రోడ్డుపై నాట్లు వేస్తున్న గ్రామస్థులు

గుడిమెట్ల (చందర్లపాడు), న్యూస్‌టుడే: బురదమయంగా మారిన రోడ్డుపై గుడిమెట్ల వాసులు వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. మండలంలోని గుడిమెట్ల నుంచి పెద్దవరం వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. వాటిని గలసతో పూడ్చించారు. చిన్నపాటి చినుకులు పడినా రోడ్డు బురదమయవుతోంది. నడవడానికి కూడా గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తుంటే జారి పడిపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు దుస్థితిని ప్రజాప్రతినిధులకు వివరించినా ప్రయోజనం లేకుండా పోయిందని విమర్శించారు. ఈనెల 24న కురిసిన వర్షాలకు తారు రోడ్డు డొంక రోడ్డు కన్నా అధ్వానంగా మారడంతో వినాయక చవితి పండుగ రోజున గ్రామస్థులు రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. వర్షాలు పడినపుడు అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామానికి వచ్చి రోడ్డు దుస్థితి చూడాలన్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.

శివగిరిపై దక్షిణ కొరియా కార్టునిస్టు పూజలు



శివలింగానికి పూజలు చేస్తున్న దక్షిణ కొరియాకు చెందిన కార్టూనిస్టు జియంగ్ జాసీ

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: వినాయక చవితి సందర్భంగా శుక్రవారం శివగిరి క్షేత్రంపై నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో దక్షిణ కొరియాకు చెందిన కార్టూనిస్టు జియంగ్ జాసీ పాల్గొన్నారు. పంచముఖ శివలింగం, జ్యోతిర్లింగానికి ఆమె పూజలు చేశారు. అష్టాదశ శక్తిపీఠాలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రాన్ని సందర్శించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మనస్సుకు ప్రశాంతతతో పాటు ఆధ్యాత్మికతకు వేదికగా ఉందని అభివర్ణించారు. ఈ సందర్భంగా జియంగ్ జాసీని శివగిరిక్షేత్ర వ్యవస్థాపకులు మల్లికార్జున శర్మ సత్కరించారు.

గణనాథునికి నీరాజనం



వినాయకుడికి ఉండ్రాళ్లు సమర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీకాంతం

గాంధీనగర్(విజయవాడ), న్యూస్‌టుడే: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా డూండీ గణేష్ సేవా సమితి నిర్వహణలో నగరంలోని జింఖానా మైదానంలో ఏర్పాటు చేసిన 72 అడుగుల భారీ గణనాథుని విగ్రహాన్ని దర్శించేందుకు భక్తులు పోటెత్తారు. పండుగ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరం, పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కమిటీ గౌరవాధ్యక్షుడు బొండా ఉమామహేశ్వరరావుతో పాటు జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, నగర ప్రముఖులు విచ్చేసి వినాయకుడికి ఉండ్రాళ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయవాడ మేయర్ కోనేరు శ్రీధర్, పార్లమెంటు సభ్యుడు కేశినేని నాని, జిల్లా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, ఏలూరు మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ పలువురు ప్రజాప్రతినిధులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భారీగా తరలివస్తుండడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సత్యనారాయణపురం సీఐ ముత్యాల సత్యనారాయణ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తోపులాటలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు ప్రైవేటు భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. పండుగ రోజు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నట్లు కమిటీ వ్యవస్థాపకులు పారేపల్లి రాకేష్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 84, రిటైల్ ధర - 99, చికెన్ విత్ స్కిన్ -139, చికెన్ స్కిన్‌లెస్ - 163

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం ధర - 91, 99, 110 చికెన్ విత్ స్కిన్- 176, చికెన్ స్కిన్‌లెస్- 186

నెక్ కోడిగ్రుడ్ల ధర

★ విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.59 పై॥. నెక్ విజయవాడ ఆఫీస్ Ph: 0866 - 6582559.

మచిలీపట్నం

సినిమాలు

● శ్రీనటరాజ్-నక్షత్రం ● రేవతి- ఫిదా ● మినీరేవతి- లై ● శ్రీవినాయక్-జయ జానకి నాయక ● సిరి కృష్ణ- అర్జున్‌రెడ్డి ● సిరివెంకట్- వివేకం ● వెంకటేశ్వర- నేనే రాజు నేనేమంత్రి ● రాంశాంతి- గౌతమ్‌నంద ● రామరాజు- ఆనందో(బ్రహ్మ ● బృందావన్- వివిపి-2

రేపు రాయితీ రుణాల లబ్ధిదారుల ఎంపిక

భాస్కరపురం,న్యూస్‌టుడే: పట్టణ పరిధిలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ,కాపు కార్పొరేషన్‌ల ద్వారా రుణాల కోసం అర్జీ చేసుకున్న అభ్యర్థులకు సోమవారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. స్థానిక జిల్లా కోర్టు సెంటరులోని అంబేడ్కర్ భవన్‌లో ఇవి ప్రారంభమవుతాయని మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు ఓ ప్రకటనలో తెలిపారు.

మూషిక వాహనా.. నమోస్తుతే



ఖొజ్జిల్లిపేటలో గణపతి...



రాజుపేటలో వినాయకుడు...



సర్కిల్‌పేట బాలాజీనగర్‌లో...

మది నిండుగా.. చవితి పండుగ!

న్యూస్‌టుడే-పోర్టురోడ్డు: వినాయక చవితి వేడుకలను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. బందరు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. నెలకుర్రు, చిన్నాపురం, వెంకటాపురం తదితర గ్రామాల ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ప్రతిమలు భక్తుల పూజలందుకుంటున్నాయి. నెలకుర్రు మెయిన్ రోడ్డు, పోతురాజు చెట్టు సెంటరు, చిన్నాపురంలోని పీహెచ్‌సీ సమీపంలో, వెంకటాపురంలోని వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.

గొడుగుపేట,న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో ఉత్సవ పందిళ్లు ఏర్పాటు చేయడంతో పట్టణం పండుగ శోభను సంతరించుకుంది. మున్సిపల్ ఛైర్మన్ బాబాప్రసాద్ కన్యకాపరమేశ్వరి ఆలయంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉత్సవ పందిళ్లను సందర్శించి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పూజలు చేశారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహం వద్ద ఏఆర్ డీఎస్పీ నారాయణరావు దంపతులు పూజలు చేశారు. ఆర్ఐ కృష్ణంరాజు, నాగిరెడ్డి, శ్రీనివాస్, శివరామకృష్ణ, చలమలశెట్టి గాంధీ తదితరులు పాల్గొన్నారు. దుర్గామహల్ సెంటర్‌లో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ తదితరులు పూజలు చేశారు. జడ్పీసెంటరు గణపతి ఆలయంలో ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన నరాలశెట్టి సాంబశివరావు హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది. పరాసుపేట సెంటరులో విద్యార్థులు భగవద్గీత పఠనం చేశారు. బుట్టాయిపేట చిట్టిపిళ్లారయ్య దేవాలయంలో రాధికాసుబ్రహ్మణ్యం శిష్యబృందంచే ప్రదర్శించిన త్యాగరాజ కీర్తనలు భక్తులను కట్టిపడేశాయి. యజ్ఞసంస్కృతి సేవా సంఘం ఆధ్వర్యంలో లక్షమోదక గణపతి హోమం జరిపించారు. వివిధ ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పలువురు దంపతులు పూజలు నిర్వహించారు.



శారదానగర్ వడ్డిరంగారావు కాలనీలో..



మంగినపూడి బీచ్ వద్ద..



చిన్నాపురం పీహెచ్‌సీ సమీపంలో నెమలివాహనంపై ఆశీనుడైన విఘ్నేశ్వరుడు



దుర్గామహల్ సెంటరులో..



చిట్టిపిళ్లారయ్య దేవాలయంలో త్యాగరాజ కీర్తనల ఆలాపన



పరాసుపేటలో విద్యార్థుల భగవద్గీత పఠనం



పోతురాజు చెట్టు సెంటరులో ఆకట్టుకుంటున్న గణనాథుడు



నెలకుర్రు మెయిన్‌రోడ్డులో పూజలందుకుంటున్న గణపతి

కాలనీ కబుర్లు

భాస్కరపురం, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని పలు రహదారుల వెంబడి ఉన్న బొండాల వ్యాపారులు ఖాళీ బొండాలను ఎక్కడపడితే అక్కడ పారవేస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ఆ వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. పరాసుపేట, దిమ్మల సెంటరు, లక్ష్మీటాకీసు సెంటరు తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంది.

● స్థానిక బస్ స్టాండ్ సెంటరులో పలు ఆటోలను రహదారిపై అడ్డుగా నిలుపుతున్నారు. వాహన చోదకులు అసౌకర్యానికి గురవ్వుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● పట్టణంలోని రిజిస్ట్రార్ కార్యాలయం, పరాసుపేట తదితర ప్రాంతాల్లో పలు పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల సమీపంలోని గణేశ మండపాల వద్ద పెద్ద సౌండ్‌తో పాటలు పెడుతున్నారు. దీనివల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

● పట్టణంలోని శివారు ప్రాంతాల్లోని కాలనీల్లో రాత్రి 10 తర్వాత కూడా అధిక ధ్వనితో పాటలు పెడుతున్నారు. నవరాత్రులు ముగిసేవరకు రాత్రి సమయాల్లో పెద్ద సౌండు పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు విద్యార్థులకు పోటీలు

చిలకలపూడి, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని భారతి హిందీ మహావిద్యాలయంలలో ఆదివారం ఉదయం 9 గంటలకు విద్యార్థులకు హిందీలో పలు అంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు భారతి హిందీ మహావిద్యాలయం ప్రధాన కార్యదర్శి చలమలశెట్టి విజయభారతి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పాటల పోటీలు నిర్వహించి వచ్చే నెల 14వ తేదీన జాతీయ భాషా దినోత్సవం నాడు బహుమతులను అందిస్తామన్నారు. హిందీలో అర్హతగల విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని కోరారు.



రైతు బజారు కూరగాయల ధరలు (నిన్నటివి)

వంగ 25 బెండ 10, దొండ 22, టమాట 35, సొర 08, 10, దోస 12, బంగాళదుంప14, పచ్చిమిర్చి 20, బీర 16, బీట్‌రూట్ 26, బీన్స్ 50, అలసందలు 20, చిలకడదుంప 30, క్యాబేజీ 14, అరటికాయ 7, 8, మునగ 05, 04, చామ 26, కాకర 20, కంద 24, కీరదోస 20, క్యాప్సికం 44, ఉల్లిపాయలు 24, క్యారెట్ 44, కొత్తిమీర 14, 05, గోరుచిక్కుడు 20.

శనివారం ఉదయం 7 గంటల వరకు మాత్రమే ఈ ధరలు వర్తిస్తాయి. ఫిర్యాదులుంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తిని ల్యాండ్ ఫోన్ నంబరు 220100లో సంప్రదించవచ్చు.

మచిలీపట్నం

జిల్లాస్థాయి ఏకపాత్రాభినయం పోటీలు

భాస్కరపురం, న్యూస్‌టుడే: మచిలీపట్నం రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 24వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని సువర్ణ కల్యాణ మందిరంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు జిల్లా స్థాయిలో ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించనున్నారు. ఇవి సోమవారం వరకు జరుగుతాయని నిర్వాహకులు ఓ ప్రకటన లో తెలిపారు.

చదువుతోపాటు చట్టాలు తెలుసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న పదో అదనపు జిల్లా జడ్జి రజిని

గొడుగుపేట, న్యూస్‌టుడే: చదువుతో పాటు చట్టాల గురించి తెలుసుకోవాలని పదో అదనపు జిల్లా జడ్జి ఎస్. రజిని అన్నారు. పట్టణ పరిధిలోని నవజీవన్ పాఠశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు వివిధ చట్టాల గురించి వివరించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొందరు లేనిపోని ఆశలు చూపి లోబరుచుకుని, మానవ అక్రమరవాణాకు పాల్పడుతున్నారని అన్నారు. ఆకతాయిలు బాలికలను ప్రేమ పేరుతో వెంటపడి వేధిస్తుంటారని, లైంగిక దాడులకు అడ్డుకట్ట వేసేందుకు పోక్సో చట్టం అందుబాటులోకి వచ్చిందని అన్నారు. యాసిడ్ దాడి బాధితులకు సంస్థ చేయూతనుందిస్తోందని తెలిపారు. పేదలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నందున వినియోగించుకోవాలని కోరారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు కోగంటి సాయిమోహన్, న్యాయవాది చీలి ముసలయ్యలు మాట్లాడుతూ వినియోగదారులు, లోక్‌అదాలత్ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అవసరం

భాస్కరపురం: ప్రతి విద్యార్థి కూడా విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు కలిగి ఉండాలని ఎక్సైజ్ సీఐ వి.వైకుంఠరావు అన్నారు. స్థానిక హర్ష కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో 'మాదక ద్రవ్యాలు- మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి సీఐ మాట్లాడుతూ మత్తుపదార్థాల జోలికి విద్యార్థులు వెళ్లవద్దని సూచించారు. ఎవరైనా వీటిని కలిగి ఉంటే ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించవచ్చని, సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మత్తుపదార్థాలు కలిగి ఉండటం నేరమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ వాటి చట్టాల గురించి వివరించారు. కళాశాల డైరెక్టర్‌లు కిరణ్‌పాల్, వి.ఈశ్వర్‌సుహాస్‌లు మాట్లాడుతూ చెడు అలవాట్లు కలిగిన వారికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇంటర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎ.మల్లేశ్వరరావు, కె.సురేష్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు బి.సంజీవ్ కుమార్, వి.వీరరాజు,కె.గణేష్, అధ్యాపకులు వి.నాగబాబు, బి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ వైకుంఠరావు

కేవీఆర్ పార్కులో నేడు మెగా రక్తదాన శిబిరం



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న వెంకట్రావు

గొడుగుపేట, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని పరాసుపేట కొట్టె వెంకటేశ్వరరావు పార్కులో ఆదివారం మెగారక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. కొట్టె వెంకట్రావు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శిబిరంలో రక్తదానం చేసేందుకు యువత ముందుకురావాలని కౌన్సిలర్ వెంకట్రావు కోరారు. రక్తం కొరత కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని, రక్తం ఇవ్వడం వల్ల ఆరోగ్యం పెంపొందడంతో పాటు తోటివారికి ప్రాణదానం చేసినవారమవుతామని అన్నారు. దీనిపై అవగాహన కల్పించడంతోపాటు 200 ప్యాకెట్ల రక్తసేకరణ లక్ష్యంగా కృషిచేస్తున్నామని చెప్పారు. యువత పాల్గొని ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు.

ఇళ్ల నిర్మాణం బృహత్తర కార్యక్రమం



టీవీలో వీక్షిస్తున్న మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు తదితరులు

గొడుగుపేట, న్యూస్‌టుడే: ఇళ్ల నిర్మాణం బృహత్తర కార్యక్రమమని మున్సిపల్ ఛైర్మన్ బాబాప్రసాదు అన్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అమరావతిలో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణ ప్రారంభ కార్యక్రమాన్ని అందరూ వీక్షించేలా శనివారం పురపాలక కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. అమరావతిలో చేపట్టిన బృహత్తర కార్యక్రమం అందరి మన్ననలు అందుకుంటుందని అన్నారు. మున్సిల్ కమిషనర్ జస్వంతరావు, పలువురు కౌన్సిలర్లు, పురపాలక సిబ్బంది, పట్టణవాసులు కార్యక్రమాన్ని వీక్షించారు.

సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

పోర్టురోడ్డు, న్యూస్‌టుడే: రైతుల భూసంబంధిత సమస్యల పరిష్కారానికే మీ ఇంటికి మీ భూమి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏఆర్ఐ అనూరాధ అన్నారు. శనివారం మండల పరిధిలోని కరగ్రహారంలో మీ ఇంటికి మీ భూమి గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అడంగల్‌లో తప్పిదాలు సరిచేయడం, పాస్‌పుస్తకాలు లేని వారికి వాటిని జారీచేయడం వంటి అన్ని సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరిస్తామని వెల్లడించారు. వీటిని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరగ్రహారం గ్రామసభకు సంబంధించి మొత్తం 18 అర్జీలు అందాయి. కార్యక్రమంలో పలువురు నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

29న కార్పొరేషన్ రుణాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

చిలకలపూడి: మండలంలో కార్పొరేషన్ల ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, కాపు అభ్యర్థులకు ఈ నెల 29న ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీవీ సూర్యనారాయణ తెలిపారు. 2015-17 సంవత్సరాల్లో దరఖాస్తు చేసుకుని, ఇంటర్వ్యూలకు వెళ్లినవారు హాజరు కానవసరం లేదన్నారు.

సేవకు ప్రతిరూపం మదర్ థెరిసా

భాస్కరపురం, న్యూస్‌టుడే: సేవకు ప్రతిరూపం మదర్ థెరిసా అని ఎనిమిదో వార్డు కౌన్సిలర్ గూడవల్లి నాగరాజు అన్నారు. పట్టణ పరిధిలోని భాస్కరపురంలో పార్కు వద్ద వార్డు మదర్ థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలన్నారు. మదర్ థెరిసాను స్ఫూర్తిగా తీసుకోవాలని సేవా రంగంలోకి రావాలన్నారు. నవకాంతి సొసైటీ సభ్యుల సహకారంతో పార్కు ప్రదేశంలో సుమారు పది మొక్కలు నాటి, గార్డులు ఏర్పాటు చేశారు.



మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కౌన్సిలర్ నాగరాజు, తదితరులు

కారుణ్య నియామకం

భాస్కరపురం, న్యూస్‌టుడే: ఇటీవల స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన విజయలక్ష్మి కుమారుడు వి.కృష్ణసాయిని కారుణ్య నియామకంపై నియమిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్‌బాబాప్రసాద్ తెలిపారు. మెడికల్ ఇన్ వాలిడేషన్‌పై కుటుంబ భద్రత పథకం కింద విరమణ చేసినందున విజయలక్ష్మి కొడుకుని అటెండరుగా నియమిస్తూ శనివారం నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బత్తిన దాసు,నారగాని ఆంజనేయప్రసాద్, తెదేపా నాయకుడు కాసాని భాగ్యారావు తదితరులు నియామపత్రం అందించిన వారిలో ఉన్నారు.



నియామకపత్రం అందజేస్తున్న ఛైర్మన్ బాబాప్రసాద్,తదితరులు

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

భాస్కరపురం: పేదలకు శిక్షణ అందించి వారికి ఆర్థిక సహాయం అందించాలన్న సేవా దృక్పథంతో నవకాంతి సొసైటీ ఏర్పాటయిందని సభ్యులు తెలిపారు. నవకాంతి సొసైటీ, జీఎన్ఆర్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని భాస్కరపురంలో ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ గూడవల్లి నాగరాజు మాట్లాడుతూ తమ వార్డులో ఆర్థికంగా వెనుకబడిన వారికి తోడ్పాటునందించేందుకు సంస్థ ముందుకు రావడంపై కృతజ్ఞతలు తెలిపారు. వార్డులో ఉన్న పేద మహిళలకు శిక్షణ అనంతరం కుట్టు మిషన్లు అందిస్తారన్నారు. ఈ కేంద్రంలో దశలవారీగా కంప్యూటర్, టైపు, డ్రైవింగ్ తరగతులు ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. నవకాంతి సంస్థ కార్యదర్శి మణిపాల్,విశ్వం మాస్టారు, సత్యం, ఈశ్వర్, సత్యనారాయణ, నాగరాజు, గూడవల్లి యువత సభ్యులు పాల్గొన్నారు.



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నవకాంతి సభ్యులు, కౌన్సిలర్ తదితరులు

జూనియర్ ఇంటర్

స్టడీప్లాన్

వృక్షశాస్త్రం

వృక్షశాస్త్రం పరిచయం అవసరం లేని శాస్త్రం. ప్రతి ఒక్కరూ జీవితంలో మొక్కల గురించి ఎంతో కొంత తెలుసుకునే ఉంటారు. వృక్షశాస్త్ర అధ్యయనం ద్వారా ప్రస్తుతం పర్యావరణంలో చోటుచేసుకుంటున్న కాలుష్యాన్ని నివారించేందుకు భావి తరాన్ని సంసిద్ధం చేయొచ్చు. మనం జీవించడానికి అతి ముఖ్యమైన ఆక్సిజన్‌ను అందించే మొక్కల పట్ల సహజమైన ఆసక్తి ఉన్న విద్యార్థులెవరైనా పరీక్షల్లో మంచి మార్కులు సాధించగలరనడంలో సందేహం లేదు.



ప్రతిభ

అవగాహనతోనే అనుకున్న మార్కులు...

ఇంటర్మీడియట్ బైపీసీ గ్రూపు మొదటి సంవత్సరం విద్యార్థులు వృక్షశాస్త్ర అధ్యయనంలో కొన్ని మెలకువలు తెలుసుకుంటే వారు పబ్లిక్ పరీక్షలు, నీట్, ఎంసెట్‌కు తగిన విధంగా సంసిద్ధం కావచ్చు. అన్ని విజ్ఞాన శాస్త్ర విభాగాల్లాగే వృక్షశాస్త్ర అధ్యయనానికి కావాల్సిన ప్రాథమిక లక్షణాలు "పరిశీలన, విశ్లేషణ." సిలబస్‌లో చదువుకునే అనేక విషయాలను మన చుట్టూ ఉండే మొక్కల్లో పరిశీలించి విషయ జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. బొమ్మలు గీసి, భాగాలను గుర్తించడం లాంటి నైపుణ్యాలను పెంపొందించుకుని, విషయ విశ్లేషణ చేసి పాఠ్యగ్రంథం (text book)ను పూర్తిగా అనుసరిస్తే పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించవచ్చు. IPE - 2018 కి తయారయ్యే మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం కొన్ని సూచనలు...

★ మొదటగా బాటనీ (వృక్షశాస్త్రం) I సిలబస్‌ను పరిశీలిస్తే మొదటి సంవత్సర పాఠ్యపుస్తకంలో 7 యూనిట్‌లు, వీటిలో 13 అధ్యాయాలు (Chapters) ఉంటాయి. సిలబస్‌లోని అన్ని అధ్యాయాలు ముఖ్యమైనవే. అవగాహన కోసం పుస్తకంలోని ప్రతి వాక్యాన్ని చదివి, సొంతంగా నోట్సు రాసుకుంటే మంచిది. ఎన్నో రకాల స్టడీ మెటీరియల్స్, గైడ్స్ అందుబాటులో ఉన్నా పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా అవగాహన చేసుకుంటేనే విద్యార్థులు IPE, NEET, EAMCET లో అత్యధిక మార్కులు పొందగలుగుతారు.

IPE ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే ప్రశ్నల స్వరూపం, మార్కుల వెయిటేజీ కొంత వరకు తెలుసుకోవచ్చు. కింద ఇచ్చిన వెయిటేజ్ టేబుల్ గతంలో జరిగిన పరీక్షల్లోని ప్రశ్నపత్రాల ఆధారంగా రూపొందించింది. ప్రశ్నపత్రంలో పేపర్ సెట్టర్‌లు మార్పులు చేసే వీలుంటుంది/ లేదా ప్రశ్నల వెయిటేజీలో మార్పులు చేసి ఇవ్వొచ్చు. ఇది కేవలం విద్యార్థుల అవగాహన కోసం మాత్రమే.

యూనిట్	అధ్యాయాలు (Chapters)	2 M	4 M	8 M	మొత్తం
I	1-4	3(6)	2(8)	-	14
II	5	2(4)	-	1(8)	12
III	6,7	-	1(4)	1(8)	12
IV	8	1(2)	1(4)	-	06
V	9, 10, 11	3(6)	2(8)	-	14
VI	12	-	1(4)	1(8)	12
VII	13	1(2)	1(4)	-	06
					76

యూనిట్ - I

ఇందులో జీవప్రపంచంలో వైవిధ్యం అనే యూనిట్‌కు సంబంధించి నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. ఈ అధ్యాయాల్లో జీవశాస్త్రంలోని మౌలిక అంశాలు, జీవుల వైవిధ్యం, విట్టేకర్ అయిదు రాజ్యాల వర్గీకరణ, వృక్షశాస్త్ర ఆవశ్యకత, పరిధి, వృక్షశాస్త్ర విభాగాలు మొదలైన అంశాలను చర్చించారు. లైకెన్ల లాంటి ప్రత్యేకమైన జీవుల గురించి, వైరస్‌లు, బ్యాక్టీరియా, సయనో బ్యాక్టీరియా, మైకోప్లాస్మాలు, విరాయిడ్‌లు లాంటి జీవుల గురించి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుంటారు. వృక్షరాజ్యంలోని శైవలాలు, బ్రయోఫైట్లు, టెరిడోఫైట్లు, వివృతబీజాలు, ఆవృత బీజాలు లాంటి మొక్కల లక్షణాలు, పోలికలు, తేడాలు తెలుసుకుంటారు.

★ **పరీక్షల కోసం:** ఈ అధ్యాయాల్లో సుమారు 48 అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు ఉన్నాయి. వీటన్నింటిని తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. ఈ విభాగం నుంచి కనీసం మూడు 2 మార్కుల (అతి స్వల్ప సమాధాన తరహావి) ప్రశ్నలు వచ్చే వీలుంటుంది. కాబట్టి వీటిని నాలుగు/ అయిదు అసైన్‌మెంట్లుగా విభజించుకుని నేర్చుకోవచ్చు. అదే విధంగా ఈ విభాగంలో కనీసం 2 స్వల్ప సమాధాన ప్రశ్నలు (స్వల్ప సమాధాన తరహా) పరీక్ష పత్రంలో కనిపించే అవకాశముంది. వర్గీకరణ సహాయకాలు, ద్వినామ నామీకరణం, యూగ్లినాయిడ్‌లు, క్రైసోఫైట్లు, డైనోఫ్లాజెల్లేట్‌ల లక్షణాలు, శైవలాలు, బ్రయోఫైట్లు, శిలీంధ్రాల ఆర్థిక ప్రాముఖ్యత, ఎరుపు/ గోధుమ శైవలాల మధ్య తేడాలు, లివర్‌వర్ట్‌లు/ మాస్‌లు, ఏకదళ బీజాలు/ ద్విదళ బీజాల మధ్య తేడాలు, వ్యవసాయ, ఉద్యాన, ఔషధ రంగాల్లో వృక్షశాస్త్ర పరిధి లాంటి అంశాలకు సంబంధించిన ప్రశ్నలు బాగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

యూనిట్ - II

అధ్యాయం- 5 పుష్పించే మొక్కల స్వరూపశాస్త్రం. దీనిలో ప్రధానంగా కాండం, వేరు, పత్రాలు లాంటి శాఖీయ భాగాలు, పుష్పం, ఫలం లాంటి ప్రత్యుత్పత్తి భాగాల స్వరూపం, రూపాంతరాలు, పుష్పవిన్యాస రకాలకు సంబంధించిన వర్ణన ఉంటుంది. ప్రయోగాలపరంగా ఈ అధ్యాయం చాలా ముఖ్యమైంది, ఆసక్తికరమైంది. పుస్తకంలోని అనేక ఉదాహరణలు మనం ప్రత్యక్షంగా చూసే వీలుంటుంది. ప్రయోగశాలలోని స్పెసిమెన్‌లను పరిశీలించి, వీటి లక్షణాలను బాగా అధ్యయనం చేయొచ్చు.

★ ముఖ్యంగా వేరు రూపాంతరాలు, కాండ రూపాంతరాలు, అనిశ్చిత పుష్ప విన్యాసం రకాలు లాంటి 8 మార్కుల ప్రశ్నలు (దీర్ఘ సమాధాన ప్రశ్నలు) తప్పనిసరిగా నేర్చుకోవాలి. వీటికి సంబంధించి పటాలను గీసి, భాగాలను గుర్తించాలి. వీటికి కనీసం 3 మార్కులు కేటాయిస్తారు (జవాబు రాసినందుకు 5 మార్కులు). ఈ అధ్యాయంలోని 24 రెండు మార్కుల ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకున్నట్లయితే పరీక్షలో కనీసం రెండు ప్రశ్నలు రాయగలుగుతారు. మొత్తానికి ఈ విభాగం నుంచి తప్పనిసరిగా 8 మార్కుల ప్రశ్నలు, 2 మార్కుల ప్రశ్నలు అధ్యయనం చేయాలి. పటాలు గీసే నైపుణ్యం రికార్డు వర్క్‌కు కూడా ఉపయోగపడుతుంది.

యూనిట్ - III

6, 7 అధ్యాయాల్లో మొక్కల్లో వివిధ రకాల ప్రత్యుత్పత్తి విధానాలు, పుష్పించే మొక్కల్లో లైంగిక ప్రత్యుత్పత్తికి సంబంధించిన పరాగ సంపర్కం, ఫలదీకరణం, పిండకోశ నిర్మాణం లాంటి అంశాలు ఉంటాయి. ఈ విభాగంలో 4, 8 మార్కుల ప్రశ్నలు ప్రధానమైనవి.

★ అలైంగిక, లైంగిక ప్రత్యుత్పత్తుల మధ్య తేడాలు, ఫలదీకరణం తర్వాత మార్పులు, అండంలోకి పరాగనాళం ప్రవేశించే పద్ధతులు, బ్యాగింగ్, విపుంసీకరణ, త్రిసంయోగం లాంటి అంశాలపై 4 మార్కుల ప్రశ్నలు, పుష్పంలోని ఫలదీకరణానంతర మార్పులు, పిండకోశం పటం వర్ణన, సూక్ష్మసిద్ధ బీజాశయం, ఫలదీకరణ విధానం లాంటి 8 మార్కుల ప్రశ్నలు ముఖ్యమైనవి.

యూనిట్ - IV

అధ్యాయం 8 లో మొక్కల సిస్టమాటిక్స్ - ఆవృత బీజాల వర్గీకరణ గురించి వివరించారు. మొక్కల స్వరూపాన్ని సాంకేతిక వర్ణన ద్వారా శాఖీయ, పుష్ప లక్షణాలను అవగాహన చేసుకోవచ్చు. అయిదో అధ్యాయంలోని అన్ని అంశాలు ఈ అధ్యాయంలో ఉపయోగపడతాయి. ఫాబేసి, సొలనేసి, లిలియేసి కుటుంబాలకు చెందిన ముఖ్యమైన మొక్కలు, వాటి శాఖీయ, పుష్ప లక్షణాలు, ఆర్థిక ప్రాముఖ్యత ఇందులోని ముఖ్యమైన అంశాలు. ఈ అధ్యాయంలో ప్రశ్నలు తక్కువ. సులభంగా మార్కులు సంపాదించే వీలుంటుంది. 2, 4 మార్కుల ప్రశ్నలు తప్పనిసరిగా చదివితే పరీక్షలో 6 మార్కులు కచ్చితంగా సాధించవచ్చు.

యూనిట్ - V

